క్లుప్తంగా

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

గరిడేపల్లి : మండలంలోని రాయినిగూడెం గ్రామంలో హోలీ పండుగను పురస్కరించుకొని త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి, హిందూజ్ఞాన వేదిక కోదాడ ఆధ్వర్యంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ఆదివారం ఇం తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పోటు వెంకటేశ్వర్లు, వంగాల మహేష్, ఉల్లి అరుణ, ముతవరపు శైలజ, చల్లా నరసింహారావు, జాస్తి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామానికి చెందిన మంత్రిప్రగడ హనుమంతరావు దేవాదాయ శాఖ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆదివారం గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆయన కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కుటుంబసభ్యులు ప్రమీల, రమేష్, సాయి ప్రణవ్, అర్చకులు శ్రీనరగరినాథుని నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

అనంతగిరి : అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను అనంతగిరి పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరి మండలంలోని గోండ్రియాల మీదుగా కోదాడకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహిస్తుండగా ఎటువంటి అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్‌లోని కంచర్ల గ్రామం నుంచి కోదాడకు వెళ్తున్న టిప్పర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈమేరకు డ్రైవర్ ఇనుపనుర్తి రాజేష్, టిప్పర్ యజమాని ఉమ్మినేని గోపి కృష్ణలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవోపేతం.. పునఃప్రతిష్ఠ ఉత్సవం

- యాగశాలలో ప్రత్యేక పూజలు, అగ్ని మధనం, హోమం
- మూలమూర్తులకు జలాధివాసం



శ్రీకోదండరాముడు, బోలాశంకరుడు మూలమూర్తులకు జలాభిషేకం చేస్తున్న భక్తులు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలో శ్రీకోదండ రామాలయ పునః ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆ సందర్భంగా రెండవ రోజు ఆదివారం యాగశాల వద్ద మూలమూర్తులైన కోదండరాముడు, బోలా శంకరులను రుత్వికులు ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ వేద పండితులు బోర్ర వాసుదేవాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అగ్నిమధనం, అగ్ని ప్రతిష్ఠాపన, జలాధివాసం వంటి కార్యక్రమాలను వేద మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు. హోమం పూజలో సుమారు 200 మంది దంపతులు పాల్గొన్నారు. అనంతరం మూలమూర్తులైన సీతాలక్ష్మణసమేత కోదండరాముడు, శ్రీవేంకటేశ్వరస్వామి, బోలా శంకరుడి లింగం, శ్రీకృష్ణుడు, వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవార్ల విగ్రహాలకు భక్తులు జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విష్ణు, శివ నామస్మరణతో యాగశాల ప్రాంగణం మారుమ్రోగింది. అంతకు ముందు పట్టణంలోని బొడ్రాయి నుంచి మహిళలు పెద్ద ఎత్తున రాగి బిందెలతో నీటిని తీసుకుని శోభయాత్రగా యాగశాలకు చేరుకుని అక్కడ మూలమూర్తులకు జలాధివాసం గావించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు నాగుబండి రంగా, నాగుబండి రంగనాథ్, నందగోపాల్, అరవింద్ దంపతులు, నిర్వహణ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



అనువంశిక ధర్మకర్తలతో మూలమూర్తులకు జలాధివాసం చేయిస్తున్న రుత్వికులు



హోమానికి అగ్ని మధనం చేస్తున్న వేదపండితులు

20న అన్నదానం

శ్రీకోదండరామాలయం పునఃప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న మూలమూర్తుల ప్రతిష్ఠ అనంతరం పట్టణంలో 70వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రతిష్ఠ ఉత్సవ కమిటీ సభ్యుడు పైడిమర్రి నారాయణరావు ఆదివారం తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో అన్నదానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు ఆయా ప్రాంతాల్లో అన్నదాన కేంద్రాలల్లో ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

మంత్రి సహకారంతో రోడ్లకు మహర్దశ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోపాల్

పాలకవీడు : మండలంలో గ్రామీణ రోడ్లకు మంత్రి ఉత్తమ్ సహకారంతో మహర్దశ పట్టిందని ఎంపీపీ భుక్యా గోపాల్ అన్నారు. ఆదివారం పాలకవీడు మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని పలు రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.6.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. నిధులు మంజూరు చేయడం పట్ల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాళోతు బుజ్జి మోతీలాల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్‌వీ సుబ్బారావు, ఎంపీటీసీలు కవిత నీమానాయక్, ఉపేందర్, సైదానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



చిలుకూరులో పోస్టర్ల తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

చిలుకూరు : ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలని తహసీల్దార్ ధృవకుమార్, ఎంపీడీఓ గిరిబాబు అన్నారు. ఆదివారం చిలుకూరు మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల నియమావళిపై ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడినందున రాజకీయ నాయకులు ఎన్నికల నియమావళి ప్రకారమే ప్రచారం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సీతయ్య, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించాలి

మఠంపల్లి : కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీఓ ఎం.జానకి రాములు కోరారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు పెదవీడు, చౌటపల్లి, బక్కమంతులగూడెం తదితర గ్రామాలో పర్యటించి ఫ్లెక్సీలు, తోరణాలు తొలగించే పనులను పరిశీలించి మాట్లాడారు. ఎంపీఓ ఆంజనేయులు, కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్ ఉన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి బోరు ఏర్పాటు



బోరు ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మునగాల : ఎండలు తీవ్రతరం కావడంతో మునగాల మండలంలోని కలకోవ గ్రామంలో తలెత్తిన తాగునీటి సమస్య పరిష్కారానికి చేపట్టిన బోరు, పైప్‌లైన్ ఏర్పాటు పనులను కాంగ్రెస్ నాయకులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో నీటి సమస్యను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి రూ.2 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు చేయడంతో పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పనస శంకర్, పనస సింహాద్రి, కుడుముల వీరయ్య, మాజీ సర్పంచ్ చిర్రా శ్రీనివాస్, కుడుముల వెంకటేశ్వర్లు, పనస సైదులు, మునగలేటి వీరబాబు, పనస లక్ష్మీనారాయణ, పనస నాగరాజు, కొక్కు నరేష్, కార్యదర్శి కీత రమేష్, వెంకటేశ్వర్లు, సత్యం పాల్గొన్నారు.

రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

నేరేడుచర్ల : రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి. ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం నేరేడుచర్లలో విలేకరులతో ఆయన మాట్లాడారు. వ్యాపారులు, మిల్లర్లు సిండికేట్‌గా మారి క్వింటాకు రోజుకు రెండు వందల రూపాయల చొప్పున ధర తగ్గిస్తున్నారన్నారు. రైతులు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు పండిస్తే క్వింటాకు రూ. 2700 ఇవ్వాల్సిన ధరను రూ.2300కు తగ్గించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. అధికారులు రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, వెంకట్ తదితరులు ఉన్నారు.

బక్కమంతులగూడెంలో వైద్యశిబిరానికి విశేష స్పందన

మఠంపల్లి : మండలంలోని బక్కమంతులగూడెంలో విష జ్వరాలు, కీళ్లనొప్పులతో బాధపడుతున్న గ్రామస్తులకు స్థానిక పల్లె దవాఖానా ఆవరణలో గ్రామ పెద్దల సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మిర్యాలగూడకు చెందిన ప్రముఖ వైద్యులు హనుమంతరెడ్డి బృందం గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బోగాల వీరారెడ్డి, ఉస్తెల అంతిరెడ్డి, సింగతల సీతారాంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, పూర్ణచందర్‌రావు, నరసింహారావు, విజయసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం హర్షణీయం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ప్రాంతీయ వైద్యశాలలో స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం హర్షణీయమని డీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ దగ్గుపాటి బాబురావు అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో 30 పడకల ఆసుపత్రిని వంద పడకలు చేసిన ఘనత ఉత్తమ్ కుమార్‌రెడ్డిదేనని అన్నారు. గత పదేళ్లుగా బ్లడ్ బ్యాంకు స్కానింగ్ సెంటర్ కావాలని సంబంధిత అధికారులను ఎస్ఆర్ ట్రస్టు తరుపున మొర పెట్టుకున్నా ఏర్పాటు చేయలేదన్నారు. కార్యక్రమంలో ఎం.అశోక్ కుమార్, జె.సుధాకర్, యాకోబ్, హరీష్, బెంజిమెన్, ఇసాక్, వీరబాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

అనంతగిరి : పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన అనంతగిరి మండలంలోని వాయిలసింగారంలో ఆదివారం చోటుచేసుకుంది. అనంతగిరి ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వాయిలసింగారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3020 నగదు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.